

MRR 69 TV
అవినీతిపై అక్షర సమరం
మన అంకుశం
సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 235 | శనివారం 14 జూన్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-

## సీఎం చంద్రబాబుతో సినీ పెద్దల

# భేటీ వాయిదా!



**ప్రముఖ సినీ పెద్దలు అందుబాటులో లేకపోవడంతో భేటీ వాయిదా పడినట్లు సమాచారం.**

**షూటింగ్స్ కారణంగా కొంతమంది సినీ పెద్దలు రేపు అందుబాటులో లేకపోవడంతో సమావేశం వాయిదా**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో టాలీవుడ్ పెద్దలు ఆదివారం భేటీ కావాల్సింది ఉంది. కానీ, తాజాగా ఆ భేటీ వాయిదా పడింది. ప్రముఖ సినీ పెద్దలు అందుబాటులో లేకపోవడంతో భేటీ వాయిదా పడినట్లు సమాచారం. షూటింగ్స్ కారణంగా కొంతమంది సినీ పెద్దలు రేపు అందుబాటులో లేకపోవడంతో సమావేశం వాయిదా వేశారు. మళ్లీ తిరిగి భేటీ ఎప్పుడు ఉంటుందనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. కాగా, థియేటర్ల బంద్ పిలుపు నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సినీ పరిశ్రమపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఏపీ ప్రభుత్వాన్ని మర్యాదపూర్వకంగా కలిసేందుకు ఇండస్ట్రీలోని పెద్దలు నిర్ణయించారు.

## చంద్రబాబు, లోకేష్ చెప్పేవన్నీ అబద్ధాలే



- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- సూపర్‌సిక్స్‌తో పాటు 143 హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేని అసమర్థ పాలన చూస్తున్నాం
- ఎల్లో మీడియాలో అద్భుతమని పొగిడించుకోవడం, గొప్ప పాలకుడని డప్పు కొట్టించుకోవడం చూసి ప్రజలు ఏవగించుకుంటున్నారు.

### జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి దారులు

# పారిపోయారు

- విద్యావిధానం పటిష్ట పరిచేందుకు విద్యార్థులకు స్కిల్ డెవలప్ చేస్తున్నాం
- స్త్రీ శక్తి ద్వారా మహిళల సర్వతోముఖాభివృద్ధి సాధ్యం
- మహిళలను అవమానపరిచేలా వైసీపీ నేతలు వ్యవహారిస్తున్నారు
- దేశ అత్యున్నత న్యాయస్థానంలో చాలామంది వైసీపీ నేతలకు బెయిల్ దొరకటం లేదు
- మంత్రి కొలుసు పార్థసారథి



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి:**

గత జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి దారులు ఏపీ నుంచి పారిపోయారని మంత్రి కొలుసు పార్థసారథి విమర్శించారు. విద్యావిధానం పటిష్ట పరిచేందుకు విద్యార్థులకు స్కిల్ డెవలప్ చేస్తున్నామని అన్నారు. స్త్రీ శక్తి ద్వారా మహిళల సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని అన్నారు. మహిళలను అవమానపరిచేలా వైసీపీ నేతలు వ్యవహారిస్తున్నారని ధ్వజమెత్తారు. దేశ అత్యున్నత న్యాయస్థానంలో చాలామంది వైసీపీ నేతలకు బెయిల్ దొరకటం లేదని చెప్పారు. శనివారం అమరావతిలో మంత్రి కొలుసు పార్థసారథి మీడియాతో మాట్లాడారు. కేవలం ఓ వ్యక్తికి బెయిల్ దొరికితేనే అంతా బాగున్నట్లుగా వైసీపీ నేతలు ప్రవర్తించటం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కూటమి సర్కార్ ఏడాది పాలనలో తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను ఏడాది పాలనలో అమలు చేశామని ఉద్ఘాటించారు మంత్రి కొలుసు పార్థసారథి. తల్లికి వందనం పథకాన్ని ప్రపంచంలో ఇంత పెద్ద ఎత్తున ఎవరూ అమలు చేయలేదని మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. తల్లికి వందనంలో భాగంగా ఎంతమంది పిల్లలు ఉన్నా పథకం అమలు - మిగతా 2లో

### మంత్రి లోకేశ్‌పై ఆరోపణలు నిరూపిస్తే

# రాజీనామా చేస్తా...

**జగన్ కు మంత్రి సవిత సవాల్**

**ఇంట్లో అందరి పిల్లలకూ 'తల్లికి వందనం' వర్తింపు**

**గత ప్రభుత్వం కంటే అదనంగా రూ.3,205 కోట్లు కేటాయింపు**

**టీడీపీ ప్రభుత్వాలతోనే విద్యకు ప్రాధాన్యం : మంత్రి సవిత**



**అంకుశం ప్రతినిధిఅమరావతి : జూన్ 14**

తల్లికి వందనం పథకం అమలుతో పేద విద్యార్థుల ఇళ్లలో ఆనందం వ్యక్తమవుతోందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళిశాఖ మంత్రి ఎస్.సవి తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చడంతో, జగన్ రెడ్డి, ఆయన పార్టీ నాయకులకే ఓర్వలేకపోతున్నారని, మంత్రి నారా లోకేశ్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి లోకేశ్ పై చేసిన ఆరోపణలు నిరూపిస్తే తాను మంత్రి పదవితో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేస్తానని, లేకుంటే పులివెందుల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తారా..? అని జగన్ ను మంత్రి సవిత సవాల్ విసిరారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో భాగంగా ముఖ్యమైన తల్లికి వందనం పథకాన్ని సీఎం చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ముందుగానే చెప్పిన విధంగా పాఠశాలలు ప్రారంభం రోజున ఈ పథకానికి సీఎం చంద్రబాబునాయుడు శ్రీకారం చుట్టారన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి ఈ పథకం వర్తింపజేశామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తల్లికి వందనం పథకం కింద అర్హులైన 67,27,164 మంది విద్యార్థులను గుర్తించామన్నారు. వారందరికీ రూ.10,091 కోట్లు వెచ్చించామన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.13 వేల చొప్పున రూ.8,745 కోట్లను నేరుగా వారి తల్లుల ఖాతాలో జమచేశామన్నారు. మిగిలిన రూ.2 వేలు చొప్పున రూ. రూ.1,346 కోట్లను పాఠశాలల అభివృద్ధికి కేటాయించామన్నారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని - మిగతా 2లో

## బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టం

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**



తెలంగాణకు మాట సాయం, మూట సాయం కూడా కేంద్రం చేయలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు మండిపడ్డారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కేటీఆర్‌కు ఎలా నోటీసులు ఇవ్వాలనే ఆలోచనతోనే రేవంత్ సర్కార్ పనిచేస్తోందంటూ దుయ్యబట్టారు. బనకచర్లతో తెలంగాణకు తీవ్ర నష్టమన్న హరీష్‌రావు.. బనకచర్లకు సీడబ్ల్యూసీ, జీఆర్ఎంబీ, అపెక్స్ కమిటీ అనుమతులు ఉన్నాయా? అంటూ ప్రశ్నించారు. అఖిలపక్ష సమావేశం పెట్టడానికి ఈ ప్రభుత్వం ముందుకు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. "తెలంగాణ ప్రయోజనాలు కాపాడటంతో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెడతారా?. కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులను ఆపాలని చూశారు.

# మంత్రి లోకేశ్ పై ఆరోపణలు నిరూపిస్తే.. రాజీనామా చేస్తా...

-మొదటిపేజీ తరువాయి

మంత్రి సవిత వెల్లడించారు. ఒకరుంటే రూ.13 వేలు, ఇద్దరుంటే రూ.26 వేలు, ముగ్గురుంటే రూ.39 వేలు, నలుగురుంటే రూ.52 వేలు, అయిదుగురుంటే రూ.65 వేలు తల్లుల ఖాతాలో జమ చేశామన్నారు. సత్య సాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం పరిగి పట్టణానికి చెందిన అంజనప్ప, ఈశ్వరమ్మ దంపతులకు అయిదురు సంతానం ఉంటే, వారందరికీ కలిపి రూ.65 వేల జమయ్యాయని తెలిపారు. అదే జిల్లా రొద్దం గ్రామానికి చెందిన ఒకే కుటుంబంలో నలుగురు విద్యార్థులకు రూ.52 వేలు జమయ్యాంటూ ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని చూపారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే వారందరికీ తల్లికి వందనం పథకం కింద డబ్బులు జమ కావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తంచేస్తున్నారన్నారు. ఫోన్లు చేసి సీఎం చంద్రబాబుకు, మంత్రి లోకేశ్ కు ధన్యవాదాలు చెబుతున్నారని మంత్రి సవిత తెలిపారు.

**వైసీపీ కంటే అదనంగా రూ.3,205 కోట్లు కేటాయింపు**

తల్లి ప్రేమకు జగన్ పరిమితి పెడితే, తమ ప్రభుత్వం తల్లి ప్రేమకు హద్దుల్లేకుండా తల్లికి వందనం పథకం అమలు చేస్తోందని మంత్రి సవిత వెల్లడించారు. 2019 ఎన్నికల్లో ఇద్దరు పిల్లలకు అమ్మఒడి పథకం అందజేస్తామని జగన్ రెడ్డి హామీ ఇచ్చి, మాటతప్పారని మండిపడ్డారు. ఇంట్లో ఇద్దరకు ముగ్గురు పిల్లులున్నా కేవలం ఒకరికి మాత్రమే అమ్మఒడి పథకం కింద రూ.13 వేలు అందజేశారన్నారు. 2022-23లో 42,61,965 మంది విద్యార్థులకు మాత్రమే అమ్మఒడి పథకం కింద వర్తింపజేశారన్నారు. వారందకీ అప్పట్లో రూ.5,540 కోట్లు మాత్రమే ఇచ్చారన్నారు. వైసీపీ ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వంలో అదనంగా 24,65,199 మంది



విద్యార్థులకు తల్లికి వందనం పథకం వర్తింప జేశామన్నారు. గత ప్రభుత్వం కంటే అదనంగా రూ.3,205 కోట్లు కేటాయించామన్నారు.

**టీడీపీతోనే విద్యకు ప్రాధాన్యం**

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వాలే వెన్నుదన్నుగా నిలుస్తున్నాయని మంత్రి సవిత గుర్తు చేశారు. తల్లికి వందనం పథకంతో పాటు పాఠశాలల ప్రారంభం రోజున డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర పథకం కింద విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఒక్కో కిట్టు విలువ రూ.2,279లని, ఆ కిట్టులో పాఠ్య పుస్తకాలు, వర్క్, నోట్‌బుక్‌లు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ, 3 జతల యూనిఫారం, బ్యాగ్, బూట్లు, 2 జతల సాక్సులు, బెల్ట్ ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు కడుపు నింపడమే కాదు వారి ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతున్నామన్నారు. పిల్లలు కూడా సంతోషంగా భోజనం చేస్తున్నారన్నారు. గత వైసీపీ హయాంలో పాఠశాలలు, వసతి గృహాలకు, గోదాముల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉన్న ముతక బియ్యాన్ని సరఫరా చేశారని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ పేరుతో మధ్యాహ్న భోజనం పథకం అమలుచేస్తున్నామన్నారు. 2014-19లోనూ ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేశామని, జగన్ రెడ్డి ఆ పథకాన్ని నిలిపేసిన విషయాన్ని మంత్రి సవిత గుర్తు చేశారు.

**లోకేశ్ పై తప్పుడు ఆరోపణలు మానుకో...**

తల్లికి వందనం పథకం అమలుతో జగన్ రెడ్డి మైండ్ బ్లాక్ అయ్యిందని, దీంతో లేనిపోని ఆరోపణలు చేస్తున్నాడని మంత్రి సవిత మండిపడ్డారు. తల్లికి వందనం పథకంలోని రూ.2 వేలు మంత్రి లోకేశ్ జేబులోకి వెళ్లాయని తప్పుడు ఆరోపణలు చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో మీరు చేసిన అవినీతిని మంత్రి లోకేశ్ పైకి నెట్టడం సరికాదన్నారు. మంత్రి లోకేశ్ పై చేసిన ఆరోపణలు నిరూపిస్తే తాను మంత్రి, ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తానని, లేకుంటే పులివెందుల ఎమ్మెల్యే పదవి రాజీనామా చేస్తావా.. అని జగన్ కు మంత్రి సవాల్ విసిరారు. అబద్ధాలు, తప్పుడు ప్రచారాలు, సానుభూతి పునాదుల మీదే జగన్ రాజకీయ జీవితాన్ని నిర్మించుకుంటున్నాడన్నారు.

**మెగా డీఎస్సీని అడ్డుకోడానికి జగన్ కుట్ర**

మహిళలంటే జగన్ కు గౌరవం లేదని, తల్లిని, చెల్లెళ్లను, రాష్ట్రంలో ఆడ బిడ్డలను ఏడిపిస్తున్నాడని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. మృతదేహాల దగ్గరికి వెళ్లి నవ్వుతాడని, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని చూసి కుళ్లి కుళ్లి ఏడుస్తున్నాడని అన్నారు. కూటమి ప్రభుత్వం టీచర్ పోస్టుల భర్తీకి నిర్వహిస్తున్న మెగా డీఎస్సీని అడ్డుకోడానికి జగన్ కుట్రపన్నాడన్నారు. డీఎస్సీని అడ్డుకోడానికి 24 కేసులు వేశారన్నారు. చివరికి సుప్రీం కోర్టులో కూడా కేసు వేస్తే, దేశ అత్యున్నత న్యాయస్థానం మొట్టికాయలు వేసిందని తెలిపారు. ప్రజలు గట్టి గుణపాఠం చెప్పినా జగన్ రెడ్డికి బుద్ధి రాలేదని మంత్రి సవిత ఎద్దేవా

# చంద్రబాబు, లోకేష్ చెప్పేవన్నీ అబద్ధాలే

**గుంటూరు:** ఏడాది కూటమి పాలనలో సూపర్ సిక్స్‌ను అమలు చేసేశాం అంటూ నిసిగ్గుగా సీఎం చంద్రబాబు ప్రకటించుకోవడం విడ్డూరంగా ఉందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మండిపడ్డారు. గుంటూరులోని క్యాంప్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, సూపర్‌సిక్స్‌తో పాటు 143 హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిగా అమలు చేయలేని అసమర్థ పాలన చూస్తున్నామని ఆక్షేపించారు. అయినా ఎల్లో మీడియాలో అద్భుతమని పొగిడించుకోవడం, గొప్ప పాలకుడని డప్పు కొట్టించుకోవడం చూసి ప్రజలు ఏవగించుకుంటున్నారని గుర్తు చేశారు. చివరకు తల్లికి వందనం పథకంలోనూ ఏకంగా 30 లక్షల మందిని తగ్గించారని అంబటి రాంబాబు గుర్తు చేశారు. ఆయన ఇంకా ఏం మాట్లాడారంటే..:

**నిస్సిగ్గుగా ఆత్మస్తుతి:**

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయింది. ఈ సందర్భంగా చంద్రబాబు పెద్దపెద్ద ప్రకటనలు ఇచ్చారు. జాతీయ మీడియాలో సక్సెస్ స్టోరీలు రాయించారు. హైదరాబాద్ నుంచి ఎల్లో మీడియా ఛానళ్లను పిలిపించుకుని, ప్రత్యేక ఇంటార్వ్యూలు ఇచ్చి భజన చేయించుకున్నారు. ఆ మూడు ఎల్లో మీడియా సంస్థల ప్రతినిధులు చంద్రబాబే సిగ్గుపడే స్థాయిలో ఆయనను ప్రశంసించారు. అద్భుతమైన పొగడ్తలతో డప్పు కొట్టే కార్యక్రమం చేశారు. అంత నిస్సిగ్గుగా చంద్రబాబు ఆత్మస్తుతి కొనసాగింది.

**తల్లికి వందనంలోనూ వంచన:**

సూపర్‌సిక్స్‌లో తల్లికి వందనం పథకాన్ని తొలి ఏడాది ఎగ్గొట్టేశారు. ఈ ఏడాది ఇస్తామని చెప్పారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు, తాను అధికారంలోకి వస్తే కుటుంబంలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం చొప్పున ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. మా ప్రభుత్వంలో 84 లక్షల మంది పిల్లలకు అమ్మ ఒడి ఇచ్చాం. కానీ, ఈరోజు చంద్రబాబు కేవలం 58 లక్షల మందికే ఇస్తున్నారు. అంటే 30 లక్షల మంది పిల్లలకు ఎగ్గొట్టేశారు. వైఎస్ జగన్ రూ.15 వేలు ఇస్తూ, టాయిలెట్లు, స్కూల్స్ నిర్వహణ కోసం రూ.2 వేలు మినహాయించారు. దాన్ని ఆనాడు నారా లోకేష్ పెద్ద ఎత్తున విమర్శిస్తూ రెండు వేలు లాగేశారు. రూ.13 వేలు మాత్రమే ఇచ్చారని చెప్పరాని భాషలో తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు. కానీ, ఇప్పుడు కూడా అవే రూ.13 వేలు ఇచ్చారు. స్కూళ్ల కోసం, విద్యా రంగం కోసం మిగిలిన మొత్తం వ్యయం చేస్తామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. అంటే మేం చేస్తే తప్పు, మీరు చేస్తే మాత్రం అది ఒప్పు అవుతుందా? ఇలా ఊరసవెల్లిలా మాట్లాడటానికి నారా లోకేష్‌కు సిగ్గుందా?. తల్లికి వందనంపై ఒకవైపు తండ్రి సీఎం చంద్రబాబు మొత్తం బడ్జెట్ రూ.10,091 కోట్లు అంటుంటే, మరోవైపు ఆయన కొడుకు మంత్రి నారా లోకేష్ మాత్రం రూ.8,745 కోట్లు అని చెబుతున్నారు. మరి ఇలా ఇద్దరు వేర్వేరుగా ఎందుకు తప్పుడు లెక్కలు చెబుతున్నారో అర్థం కావడం లేదు.

**సూపర్ సిక్స్‌కు రూ.81 వేల కోట్లు కావాలి:**

సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను ఇచ్చి, వాటిని నెరవేరుస్తామని మాట ఇచ్చి, ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చారు. తరువాత అన్ని హామీలను గాలికి వదిలేశారు. వాటికి కావాల్సిన నిధులను కూడా కేటాయించలేకపోతున్నారు. సూపర్ సిక్స్ అమలు చేయాలంటే రూ.81 వేల కోట్లు అవసరం. వాటి అమలు లేదు. మరోవైపు ఈ ఒక్క ఏడాదిలోనే ఏకంగా రూ.1,58,604 కోట్లు వివిధ సంస్థల నుంచి రికార్డు బ్రేక్ చేస్తూ అప్పులు తెచ్చారు.

ఈ సొమ్ము ఏం చేశారో తెలియదు. కూటమి పాలన ఇంత దౌర్భాగ్యంగా ఉంటే, తమ పాలన అద్భుతం అని ఎల్లో మీడియాలో చెప్పుకోవడానికి సిగ్గు పడాలి. తల్లికి వందనంలో దగా, మోసం. విద్యాశాఖ మంత్రి లోకేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అమలు చేసిన అమ్మ ఒడి లెక్కలు తనకు అర్థం కావడం లేదంటూ అమాయకంగా మాట్లాడుతున్నాడు. ఆ మాత్రం అర్థం కాని మొద్దు అబ్బాయినని లోకేష్ అంగీకరిస్తున్నారా?.

**నాడు పథకాలకు రూ.4.58 లక్షల కోట్లు:**

వైఎస్సార్‌సీపీ కేవలం నాలుగు పేజీల మేనిఫెస్టోను విడుదల చేసి, వాటిలో ఏడాదిలోనే 90 శాతం అమలు చేసింది. తొలి ఏడాదిలోనే 3.58 కోట్ల మంది లబ్ధిదారులకు మేలు చేసింది. రూ.40,627 కోట్లు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశాం. అయిదేళ్లలో ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) కింద రూ.2,73,756.17 కోట్లు లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశాం. నాన్ డీబీటీ కింద రూ.1,84,604.32 కోట్లు ప్రయోజనం చేకూర్చాం. అలా మొత్తం రూ.4,58,360.43 కోట్లతో అయిదేళ్లలో ప్రజలకు వివిధ పథకాల కింద ప్రయోజనం కలిగించాం.

**మహిళలకు ఇచ్చిన హామీల అమలు ఏదీ?:**

ఆడబిడ్డ నిధి ప్రకారం 18 ఏళ్లు నిండిన మహిళలు రాష్ట్రంలో 2.07 కోట్ల మంది ఉన్నారు. ఇందులో 18 నుంచి 59 ఏళ్ల వారు 1.80 కోట్ల మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.1500 చొప్పున ఇవ్వాల్సి వస్తే ఏడాదికి రూ.32,400 కోట్లు అవసరం. గత ఏడాది పూర్తిగా ఈ పథకం ఎగ్గొట్టారు. ఈ ఏడాది ఇస్తారో లేదో తెలియదు. దీపం పథకం కింద 1,59,20,000 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఒక్కో కుటుంబానికి మూడు సిలెండర్లు ఇవ్వాలంటే ఒక్కో సిలెండర్ రూ.850 చొప్పున మొత్తం ఏడాదికి రూ.4,083.48 ఖర్చు చేయాల్సి ఉంది. కానీ చంద్రబాబు కేవలం ఒక్క సిలెండర్ మాత్రమే ఉచితంగా ఇచ్చి, దానికి చేసిన వ్యయం రూ.865 కోట్లు మాత్రమే. దీపం పథకాన్ని అమలు చేసేశామని చెప్పుకున్నారు. ఈ పథకంలో మొత్తం రూ.3218.48 కోట్లు ఎగ్గొట్టారు. ఉచిత బస్సు అన్నారు. ఈ పథకం అమలు చేస్తే ఏడాదికి రూ.3500 కోట్లు అవసరం. గత ఏడాది పూర్తిగా దీనిని ఎగ్గొట్టేశారు.

**హామీల అమలుకు కేటాయింపులు ఏవీ?:**

యాభై ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెన్షన్ అన్నారు. రాష్ట్రంలో ఈ కేటగిరిలో మొత్తం 20 లక్షల మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.4000 చొప్పున పెన్షన్ ఇవ్వాలంటే ఏడాదికి రూ.9600 కోట్లు ఇవ్వాలి. గత ఏడాది ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? రాష్ట్రంలో ఇరవై లక్షల ఉద్యోగాలు ఇస్తాం, లేకపోతే ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3000 భృతి ఇస్తామని హామీ ఇచ్చారు. అలా ఇవ్వాల్సి వస్తే రూ.7200 కోట్లు కేటాయించాల్సి ఉంది. కానీ, ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. అలాగే రైతుభరోసా కింద కేంద్రంతో సంబంధం లేకుండా ఏడాదికి రూ.20 వేలు ఇస్తామన్నారు. రాష్ట్రంలో 53,58,266 మంది రైతులు ఉన్నారు. వీరికి ఏడాదికి రూ.1,716 కోట్లు ఇవ్వాల్సి ఉంటే, దానికీ పంగనామాలు పెట్టేశారు.

సాక్షి కార్యాలయాలపై దాడులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలి:

కొమ్మినేని శ్రీనివాసరావు వంటి సీనియర్ జర్నలిస్ట్‌ను కక్ష సాధింపుతో అరెస్ట్ చేసిన ఘటనపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసింది. అయినా గుంటూరులో తెలుగుదేశం పార్టీ మహిళలు వైయస్ భారతమ్మ క్షమాపణలు చెప్పాలని ధర్నా చేశారు. అంతకు ముందు టీడీపీ కార్యకర్తలు పలుచోట్ల సాక్షి మీడియాపై విషం చిమ్మారు. కార్యాలయాలపై దాడులు చేశారు. తక్షణం వీటికి చంద్రబాబు క్షమాపణలు చెప్పాలి. సభ్యత, సంస్కారంతో వ్యవహరించాలని చంద్రబాబు, లోకేష్‌ను హెచ్చరిస్తున్నాం. ప్రశ్నించే ప్రతి ఒక్కరిని తప్పుడు కేసులతో భయపెట్టాలని చూస్తున్నారు. వైఎస్సార్‌సీపీని భూస్థాపితం చేయాలని చంద్రబాబు కలలు కంటున్నారు. తెలుగుదేశం తప్ప ఈ రాష్ట్రంలో మరే రాజకీయ పార్టీ ఉండకూడదని ఆయన అనుకుంటున్నారు. కానీ, అది ఏ మాత్రం సాధ్యం కాదు. నిజానికి రాబోయే రోజుల్లో చంద్రబాబు మళ్లీ రాష్ట్రం వదిలి పారిపోయే పరిస్థితి వస్తుందని అంతా అంటున్నారని అంబటి రాంబాబు చెప్పారు.

# తల్లులను మోసగించిన మిమ్మల్ని ఏమనాలి బాబూ?

**అమరావతి:** చంద్రబాబు సర్కార్ మోసాలను ఎక్స్ వేదికగా మాజీ మంత్రి ఆర్కే రోజా నిలదీశారు. "సూపర్ సిక్స్ పథకాల్ని అమలు చేశామని, ఇకపై వాటి గురించి ప్రశ్నిస్తే, నాలుక మందమని అనుకోవాల్సి వస్తుందని సీఎం చంద్రబాబు ఇటీవల అన్నారు. ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం పథకం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చి, అడ్డగోలు షరతులతో కొందరికే పథకాన్ని పరిమితం చేశారు. తల్లులను మోసం చేసిన మిమ్మల్ని ఏమనాలి చంద్రబాబూ" అంటూ ఆర్కే రోజా దుయ్యబట్టారు. "ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసం ఆచరణ సాధ్యం కాని హామీల్ని ఇచ్చి, తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కో పథకాన్ని నీరుగార్చుతున్నారు. సూపర్ సిక్స్ పథకాల్ని అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటూ, మరోవైపు షరతులతో వాటికి కోత విధిస్తుండడం నిజం కాదా?. తాజాగా తల్లికి వందనం పథకాన్ని ఏకంగా ఆంధ్రప్రదేశ్‌లోని కేంద్రీయ విద్యాలయం విద్యార్థుల్ని మొత్తానికి మొత్తం అనర్హులుగా చేయడం నిజం కాదా?" అంటూ చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. "గతంలో జగనన్న హయాంలో కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థుల ప్రతి తల్లీకి అమ్మ ఒడి లబ్ధి చేకూర్చాం. ఆ వివరాలు ప్రభుత్వం దగ్గర



అధికారికంగా ఉన్నాయి. కానీ ఎగ్గొట్టే కుట్రతో యూడైస్ ప్లస్ నుంచి కేవీ సంస్థలను కట్ చేసినట్టు, దాంతో తాము తల్లికి వందనం పథకానికి దూరమవుతున్నామని తల్లులు వాపోతున్నారు. ..పేరుకు అందరికీ పథకాన్ని అమలు చేస్తున్నామంటూ, మరోవైపు ఎగ్గొట్టారనేందుకు మచ్చుకు ఇదో ఉదాహరణ మాత్రమే. ఇలాంటి విన్యాసాలు మున్ముందు కూటమి ప్రభుత్వం ఇంకెన్ని చేస్తుందో అనే ఆందోళన ప్రజల్లో వుంది. అందుకే జగన్ అంటే నమ్మకం, బాబు అంటే మోసం అని ప్రజలు అనుకుంటున్నారు." అని ఆర్కే రోజా ట్వీట్ చేశారు.

## జగన్ ప్రభుత్వ హయాంలో పెట్టుబడి దారులు పారిపోయారు




-మొదటిపేజీ తరువాయి

చేశామని తెలిపారు. వైసీపీ అమ్మఒడికి రూ.15 వేలు ఇస్తామని చెప్పిందని.. పిల్లలందరికీ ఇస్తామని చెప్పి ఒక్కరికే ఇచ్చిందని గుర్తుచేశారు. ప్రతిపక్షం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. అసెంబ్లీకి రాని ప్రతిపక్ష పార్టీ దేశంలో కేవలం వైసీపీనేనని విమర్శలు చేశారు. తల్లికి వందనంలో రూ. 2 వేలు మంత్రి నారా లోకేష్ జేబులో వేసుకుంటున్నారని వైసీపీ నేతలు అన్నారని.. ఈ విషయంలో లోకేష్ సవాల్‌కి సిద్ధమా అంటే వారు పారిపోతున్నారని ఎద్దేవా చేశారు. రూ. 34 వేల కోట్లు ఏడాదిలో పెన్షన్ కిందా ఇచ్చామని చెప్పారు. వైసీపీ హయాంలో ఏ పథకాలు ఇచ్చారో తెలుసుకోవాలని అన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి కుటుంబానికి రూ. 1.04లు ఇచ్చామని గుర్తుచేశారు. జగన్ హయాంలో కేవలం రూ.64 వేలు మాత్రమే ఇచ్చారని.. పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించారా అని మంత్రి పార్థసారథి ప్రశ్నించారు.

**సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశాం...**

'కూటమి పాలనలో తల్లికి వందనం, ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నాం. మా ప్రభుత్వంలో పిల్లలను చదివించి, వాళ్లకు ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తున్నాం. మేము సామాన్యులను ఎక్కడా కేసులు పెట్టి వేధించలేదు. గత వైసీపీ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో పని చేసింది. కూటమి పాలనలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నాం. పిల్లలకు మంచి భవిష్యత్ ఇస్తాం. ఆ రెండు వేల రూపాయలను పాఠశాలలకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం ఖర్చు చేస్తాం. అశోక్ లేలాండ్, అమర్ రాజా లాంటి సంస్థలు ఏపీ నుంచి వెళ్లిపోయాయి. గత జగన్ ప్రభుత్వంలో చేసిన రూ.10 లక్షల కోట్ల అప్పులకు.. మా ప్రభుత్వంలో వడ్డీలకే వేల కోట్లు చెల్లిస్తున్నాం. పోలవరాన్ని ధ్వంసం చేశారు. అమరావతి రాజధాని అని మూడు రాజధానులని చట్టం చేసిందే వైసీపీ. పోలవరం ప్రాజెక్టు 2027లోగా పూర్తి చేస్తాం. 87 లక్షల మంది ఉంటే 45 లక్షల మందికే ఎందుకు అమ్మవడి ఇచ్చారు' అని మంత్రి కొలుసు పార్థసారథి ప్రశ్నించారు

## కొమ్మినేనిపై హెూంమంత్రి అనిత వ్యాఖ్యలు హేయం: పొన్నవోలు



**తాడేపల్లి:** సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావునుద్దేశించి హెూంమంత్రి అనిత వ్యాఖ్యలు హేయం అని వైస్సార్‌సీపీ జనరల్ సెక్రటరీ, సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. కొమ్మినేనిపై హెూంమంత్రి వ్యాఖ్యలను సుప్రీంకోర్టుకు నివేదిస్తామని సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. డిబేట్‌లో పార్టిసిపెంట్ మాటలను కొమ్మినేనికి ఎలా ఆపాదిస్తారని సుప్రీంకోర్టు ఈ ప్రభుత్వాన్ని కడిగేసింది. కొమ్మినేని విషయంలో రాజ్యాంగం ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగింది కాబట్టే సుప్రీంకోర్టు గట్టి ఆదేశాలు ఇచ్చింది" అని పొన్నవోలు పేర్కొన్నారు. తన విచక్షణాధికారాన్ని వినియోగించి ఆర్టికల్ 32 కింద సుప్రీంకోర్టు కొమ్మినేని విడుదలకు ఆదేశాలు ఇచ్చింది. అయినా సరే కొమ్మినేనిపై ఉద్దేశ పూర్వకంగా విషం కక్కుతున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు ఈ ప్రభుత్వం కుట్రను బద్దలు చేశాయి. సుప్రీంకోర్టు ఆదేశాలను తట్టుకోలేక ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. తాము చేసిన ఆరోపణలనే ఈ రాష్ట్రం, దేశమే కాదు, కోర్టులు కూడా నమ్మాలన్న భావనలో ఉన్నారు. సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను శిరసావహించాలన్న విజ్ఞత హెూంమంత్రి చూపడంలేదు. ఒక హెూంమంత్రికి సుప్రీంకోర్టు ఆదేశాల విలువ తెలియకపోవడం దురదృష్టకరం. హెూంమంత్రి అనిత మాటలు సుప్రీంకోర్టును తప్పుబట్టేలా ఉన్నాయి" అని పొన్నవోలు ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈ కేసు ఇంకా ముగిసిపోలేదు, విచారణలో ఉందనే విషయం ఆమెకు తెలియదా?. సుప్రీంకోర్టు విచారణలో ఉన్న అంశంపై ఒక హెూంమంత్రి ఇష్టానుసారంగా మాట్లాడటం చట్ట విరుద్ధం. కొమ్మినేని అరెస్టు వెనుక రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయని ఆమె మాటల్లోనే వ్యక్తం అవుతోంది. డిబేట్లు చేయొద్దని సుప్రీంకోర్టు ఎలాంటి దేశాలు ఇవ్వలేదు. జర్నలిస్టుగా ఆయన వాక్ స్వాతంత్రాన్ని కాపాడాల్సిన బాధ్యతనూ సుప్రీంకోర్టు గుర్తుచేసింది.ల ..కావాలంటే ఆ తీర్పు కాపీని మంత్రికి పంపిస్తాను. తాను అనని మాటలను కొమ్మినేనికి ఆపాదించి, ఆ ముసుగులో సాక్షి కార్యాలయాలపై దాడులు చేశారు. ఈ దాడులకు పోలీసులు పహరా కాశారు. దాడుల్లో పాల్గొన్న వారంతా టీడీపీ నాయకులు, కార్యకర్తలే. వీడియో, ఫొటోల రూపంలో అన్ని ఆధారాలున్నాయి. తుదపరి విచారణలో మొత్తం ఈ వ్యవహారాన్ని కోర్టు ముందుపెడతాం. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. లేకుంటే అరాచకం ప్రబలుతుంది" అని పొన్నవోలు సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు.

## సీఎం చంద్రబాబుతో సినీ పెద్దల భేటీ వాయిదా..!

ఏపీలో థియేటర్‌ల పరిస్థితి.. సదుపాయాలకు సంబంధించి డీటెయిల్ రిపోర్ట్ ఇవ్వాలని సినిమాటోగ్రఫీశాఖ ఆదేశాలు జారీ చేయడంతో అధికారులు రంగంలోకి దిగి పలు థియేటర్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లను సినీ ప్రముఖులు కలవనున్నారు. రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లయినా ఏపీలో అంతంత మాత్రంగానే సినీ ఇండస్ట్రీ ప్రభావం ఉంటుంది. కనీసం సింగిల్ షెడ్యూల్ సినిమా కూడా ఏపీలో తీయలేని పరిస్థితి ఉండటంతో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం ఏం చెబుతుంది, సినీ ప్రముఖులు ఏమి కోరతారనే అంశంపై ఈ సమావేశంలో చర్చలు జరుగనున్నాయి. చంద్రబాబు సూచన మేరకు సినీ ప్రముఖులకు మంత్రి కందుల దుర్గేష్ ఫోన్ చేసి ఆహ్వానం పలికారు. ఈ భేటీకి మొత్తం 35 నుంచి 40 మంది సినీ ప్రముఖులు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ సమావేశం అనంతరం ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లతో మంత్రి కందుల దుర్గేష్ ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

# సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఖర్చు లేని మెడిసిన్

## సంపూర్ణ ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరం






**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 14:** యోగ ధ్యానం వలన మానసిక ప్రశాంతత కలిగి ఆరోగ్యం గా ఉంటారని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మెన్ ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. మండపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం మండపేట బాబు అండ్ బాబు కన్వర్షన్ వద్ద యోగాభ్యాసం ట్రయిల్ రన్ నిర్వహించారు. ఈ నెల 21 అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఈ యోగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలని కోరారు. ప్రతి రోజు ఉదయం యోగ సాధన చేస్తే వ్యాధులు దరి చేరవని చెప్పారు. ఆధునిక కాలంలో వత్తిడి పెరిగి పలు అనారోగ్య సమస్యలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అదే ఉదయం సాయంత్రం క్రమం తప్పకుండా యోగ సాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పేర్కొన్నారు. యోగా తో పాటు సరైన ఆహార అలవాట్లు చేసుకోవాలని కోరారు. చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి మాట్లాడుతూ మంచి ఆరోగ్యం సమాజంకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. యోగా ద్వారా జీవన విధానం లో పెను మార్పులు వస్తాయన్నారు. మానసిక వత్తిడి దూరం కావాలంటే యోగ ఆసనాలు వేయడం ఒక్కటే మార్గం అన్నారు. మునిసిపల్ కమీషనర్ టివి రంగారావు మాట్లాడుతూ యోగాంధ్ర క్యాంపెయిన్-2025 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం వేదికగా ఈ నెల 21 న అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. దిన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ల సూచనల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. మండపేట పురపాలక సంఘం ఆద్వర్యంలో యోగా ట్రయల్ రన్ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. సత్యసాయి ధ్యానమండలి విజయవాడ రఘు, తిరుపతిరాజు లు యోగ శిక్షణా ఇచ్చారు. యోగ ఆసనాలు వేయించారు. అదే అనంతరం అన్ని వార్డు సచివాలయల్లో గల వార్డులలో సచివాలయ సిబ్బందితో ఈ యోగా ట్రయల్ రన్ నిర్వహించారు. బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కోన సత్యనారాయణ, పట్టణ ప్రజలు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అనంతలో ఘనంగా

# ప్రపంచ రక్త దాతల దినోత్సవ వేడుకలు






**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 14 :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (IRCS) అనంతపురం, వరల్డ్ బ్లడ్ డోనర్స్ డేను ఘనంగా జరుపుకుంది. వివిధ సేవా సంస్థలు, రక్తదాన శిబిరాల నిర్వాహకుల సేవలను గుర్తించి, సన్మానించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ తరపున రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ గుత్తా కేశవ నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొని అవార్డు గ్రహీతలను సన్మానించారు. కార్యక్రమం మొదట M/s పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ CSR సహాయంతో కొనుగోలు చేసిన ప్లేట్‌లెట్ అజిటేటర్, ఇంక్యుబేటర్‌లను ఆవిష్కరించారు. M/s మోబిస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు అందించిన పరికరాలు ప్రారంభించారు.

- అనంతరం ప్రత్యేక అవార్డులను అమిలినేని సురేంద్ర బాబు (కల్యాణదుర్గం ఎమ్మెల్యే, సంవత్సరంలో 3,000 యూనిట్ల రక్తదానం), CGST విభాగం (350 యూనిట్లు), SRIT & ప్రభుత్వ కళాశాల (జూనియర్ & యూత్ రెడ్ క్రాస్‌లో 100% నమోదు), విష్ణు ప్రియ (NSS ప్రోగ్రాం ఆఫీసర్, ప్రభుత్వ కళాశాల), సీనియర్ IRCS సభ్యుడు అలంబన జనార్ధన్‌లకు అందజేశారు. అనంతరం వివిధ స్వాత్యంత సంస్థలు, రక్త దాన సంఘాలు, సంస్థలు, కంపెనీలు, తదితర 81 రక్తదాన శిబిర నిర్వాహకులకు కృతజ్ఞతగా మెమెంటోలు బహుకరించారు.

- IRCS చైర్పర్సన్ కాపు భారతి మాట్లాడుతూ, IRCS అనంతపురం రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో ఉందని, అందరి సహకారంతో మొదటి స్థానం సాధిస్తామని చెప్పారు. పవర్‌గ్రిడ్ AGM వెంకన్న, CSR ద్వారా ప్రజలకు మరింత సహాయం చేస్తామని తెలిపారు. ఆర్డీఓ కేశవ నాయుడు, తాను విద్యార్థి దశ నుండి సేవా కార్యక్రమాలు, రక్తదానంలో పాల్గొంటున్నానని, ఏటా రెండుసార్లు రక్తం దానం చేస్తానని చెప్పారు. రక్తదానానికి ముందుకు రావాలని ప్రజలను కోరారు. అసిస్టెంట్ కమిషనర్ సుందర రాజు, ఈ ఏడాది కూడా రక్తదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. వైస్ చైర్మన్ డాక్టర్ G. లక్ష్మణ శ్రసాద, రక్త గ్రూపులు, రక్త సంబంధిత వ్యాధుల గురించి వివరించి, త్వరలో IRCS తలసేమియా ట్రాన్స్‌ఫ్యూజన్ సౌకర్యం ప్రారంభిస్తుందని తెలిపారు. కార్యక్రమములో వివిధ సంస్థల ప్రతినిధులు, అధికారులు, నాయకులు, స్వచ్ఛంద సేవకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైయస్సార్సీపి పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరి కృషి ఎంతో అవసరం..

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి.



**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 14:** వైఎస్సార్సీపీ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరి కృషి ఎంతో అవసరమని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల వైఎస్ఆర్సిపి ధర్మవరం పట్టణ క్లస్టర్-2 అధ్యక్షుడిగా కోటిరెడ్డి బాల్రెడ్డిని నియమించడంతోపాటు పట్టణ కమిటీని కూడా నియమించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే నివాసంలో జరిగింది. అనంతరం అందరూ కూడా కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు మద్దిలేటి మల్లికార్జున, కత్తే పెద్దన్న, నాయకులు చాంద్ బాషా, సుభాన్ భాష, చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, చింతా మారుతి, కడప రంగస్వామి, గోరకాటి పురుషోత్తం రెడ్డి, బాలం గోపాల్, బడన్నపల్లి కేశవరెడ్డి, తిరుమల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వైఎస్ఆర్సిపి నాయకుడికి పరామర్శబీబీ పట్టణములోని సిద్దయ్యగుట్ట లో గల వైఎస్ఆర్సిపి వాడు ఇంచార్జ్ కుమారస్వామి అనారోగ్యంతో బాధ పడుతున్న విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పార్టీ అండగా ఎల్లప్పుడూ ఉంటుందని వారు భరోసా కల్పించారు.

## శాంతమైన వాతావరణంలో

# స్మశాన వాటిక ఏర్పాటుకు చర్యలు.

### ఫోనిక్స్ ప్రతినిధులతో కలిసి స్థల పరిశీలనలో బిజీగా మంత్రి బృందం.



**అంకుశం న్యూస్ ధర్మవరం జూన్ 14:** ధర్మవరం పట్టణంలోని హిందూ స్మశాన వాటికల కొరత వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తక్షణమే స్పందించారు. పట్టణంలో స్మశాన వాటిక స్థలాల యొక్క తీవ్ర లోపం కారణంగా శవసంస్కార కార్యక్రమాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆయన దృష్టి సారించారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని మంత్రి ఫోనిక్స్ కంపెనీ ప్రతినిధి రుద్ర కుమార్ తో గుర్తించారు. ఈ సందర్భంలో, మంత్రి ఆదేశాల మేరకు ఫోనిక్స్ కంపెనీ ప్రతినిధి రుద్ర కుమార్ గారితో కలిసి మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు , మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ ధర్మవరం పట్టణంలోని డంప్‌యార్డ్ ప్రాంతాన్ని సందర్శించారు. ప్రత్యక్షంగా స్థలాన్ని పరిశీలించిన అధికారులు, డంప్‌యార్డ్ ప్రాంతం స్మశాన వాటిక ఏర్పాటుకు అత్యంత అనువైనదిగా ఉందని గుర్తించారు. శాంతమైన వాతావరణంతో ఉండటమే కాక, దహన సంస్కారాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయగలిగే సామర్థ్యం ఉన్న ప్రాంతమని నిపుణుల అభిప్రాయమని వారు వెల్లడించారు. అలాగే, ఇప్పటికే ఉన్న పాత స్మశాన వాటికను కూడా పరిశీలించి, అక్కడ మరమ్మతులు మరియు అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని నిర్ణయించారు. హిందూ సమాజానికి మరింత గౌరవంగా, సౌకర్యంగా శవసంస్కారాలు నిర్వహించుకునేలా వీరు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రయత్నం ద్వారా ధర్మవరం పట్టణ ప్రజలకు ఎంతో కాలంగా ఎదురవుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కనుంది. మంత్రి గారి చొరవకు ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డి.ఈ. వీరేష్, జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీష్, ధర్మవరం పట్టణ అధ్యక్షులు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు సాకే ఓబ్లేష్, జిల్లా మైనార్టీ నాయకులు నబి రసూల్, బిజెపి నాయకులు బిల్లే శ్రీనివాసులు, డోలా రాజారెడ్డి, వీరనారప్ప, జూటూరు వెంకటేష్, పోతుకుంట రాజు, చంద్రమౌళి, నారప్ప, పవన్ కుమార్ రెడ్డి, చంద్ర మహేష్, బోయ నర్సింహులు, వడ్డే శీన, తదితరులు పాల్గొన్నారు.

## మిట్టపాలెం గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం లో పాల్గొన్న బైరెడ్డి, దారపనేని



**కనిగిరి జూన్ 13 అంకుశం న్యూస్:** కనిగిరి నియోజకవర్గం సిఎస్ పురం మండలం మిట్టపాలెం గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం జూన్ 13వ తేదీ నుండి 15 తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ కళ్యాణ మహోత్సవంలో మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పాములపాటి మాధవ ప్రసాద్ శ్రీమతి రమణమ్మ దంపతుల సారాధ్యంలో సీతారాముల వారి కళ్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం చైర్మన్ కొమ్మినేని ఆదినారాయణ, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి పాల్గొని కళ్యాణం నిర్వహిస్తున్న పాములపాటి మాధవ ప్రసాద్ దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ కమ్మవారి అన్నదాన సత్రం వైస్ ప్రెసిడెంట్ తాళ్ల వెంకటసుబ్బయ్య, మిట్టపాలెం సీతారాముల దేవస్థానం అధ్యక్షులు చలువాది తిరుపతయ్య,కొమ్మినేని వెంకటరావు, దార పనేని రాజేంద్రప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయులు కృష్ణ మోహన్ ,పాములపాటి లక్ష్మీనరసయ్య, ఆర్ కే పల్లి మాజీ సర్పంచ్ చావా సుబ్బయ్య, కోయిలంపాడు తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు బాలకేశవరెడ్డి, తదితర గ్రామస్తులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని సీతారాముల వారి కళ్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించి తరించారు.

## పరిటాల సునీతను కలిసిన తెలంగాణ మంత్రి సీతక్క

### హైదరాబాద్ లోని ఎమ్మెల్యే ఇంటికి వెళ్లిన మంత్రి సీతక్కు ఆప్యాయంగా పలకరింపులు, పలు అంశాలపై చర్చలు





**అంకుశం న్యూస్ అనంతపురం జూన్ 14:** రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతను తెలంగాణకు చెందిన పంచాయతీ రాజ్, స్త్రీ సంక్షేమశాఖ మంత్రి దన్సారీ అనసూయ (సీతక్క) కలిశారు. హైదరాబాద్ లోని ఎమ్మెల్యే సునీత నివాసానికి మంత్రి వెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి ఎమ్మెల్యే సునీతతో పాటు ఆమె కుటుంబ సభ్యులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సీతక్క ఎమ్మెల్యే సునీత ఎంతో ఆప్యాయంగా ఒకరినొకరు పలుకరించుకున్నారు. ఆ తర్వాత పలు అంశాల గురించి చర్చించుకున్నారు. గతంలో తెలుగుదేశం పార్టీలో ఉన్న సమయంలో జరిగిన పలు అంశాల గురించి గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం తెలంగాణ, ఏపీ రాజకీయాల గురించి కూడా మాట్లాడుకున్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖగా గతంలో ఎమ్మెల్యే సునీత పని చేసిన నేపథ్యంలో అప్పటి పరిస్థితులు, ప్రజలకందించిన సేవలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ జీవితంలో పేద వర్గాల కోసం పని చేయడంలో సీతక్కకు మించి ఎవర్నీ చూడలేదన్నారు. ఆమె కష్టమే ఇంత స్థాయికి తీసుకొచ్చిందని అన్నారు. తమ మధ్య అప్పటి నుంచి బలమైన స్నేహం ఉందని ఎమ్మెల్యే సునీత అన్నారు....


## జగన్ అంటే నమ్మకం -చంద్రబాబు అంటే మోసం" అనే పుస్తకావిష్కరణ లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సత్తి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 14:** రాజమహేంద్రవరం వై ఎస్ ఆర్ సి పి పార్టీ కార్యాలయంలో" జగన్ అంటే నమ్మకం -చంద్రబాబు అంటే మోసం" ,అనేపుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వైఎస్.ఆర్.సి.పి రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం పరిశీలకులు తిప్పల గురుమూర్తిరెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వై.ఎస్.ఆర్.సి.పి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గూడూరు శ్రీనివాస్ రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా, అనపర్తి నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి కొవ్వూరు నియోజకవర్గం సమన్వయకర్త తలారి వెంకట్రావు, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గం సమన్వయకర్త మార్గాని భరత్ రామ్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర క్యాంపెయిన్ లో పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి.

ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలి



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 14:** అనపర్తి శ్రీ రామారెడ్డి జిల్లా పరిషత్ బాయ్స్ హైస్కూల్ లో "యోగాంధ్ర" క్యాంపెయిన్ ను ప్రారంభించిన అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి. ఈ సందర్భంగా శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. యోగా ద్వారా శారీరక,మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను దినచర్యగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజకీయ నాయకులు, యోగా గురువులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు అనపర్తి టౌన్ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల రాష్ట్ర స్థాయి యోగా గ్రాండ్ సక్సెస్






- : ప్రతి ఒక్కరూ యోగాను రోజు పాటిస్తూ ఆరోగ్యాన్ని బాగుపరచుకోవాలి
: జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి,
- ప్రపంచం మొత్తం ఏపీ వైపు చూసేలా సీఎం చంద్రబాబు చేస్తున్నారు
- : అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్
- : నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొని యోగాసనాలు వేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, తదితరులు..

**అంకుశం న్యూస్ అనంతపురం, జూన్ 14 :** అనంతపురం నగరంలో దివ్యాంగులతో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమం గ్రాండ్ సక్సెస్ అయింది. యోగాంధ్రలో భాగంగా అనంతపురం నగరంలోని పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో శనివారం ఉదయం దివ్యాంగులతో రాష్ట్రస్థాయి యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, , జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి యోగాంధ్ర కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జడ్పి చైర్ పర్సన్, జాయింట్ కలెక్టర్, తదితరులచేత యోగ మాస్టర్ ట్రైనర్స్ యోగాసనాలు వేయించారు. దివ్యాంగులు, పింఛన్ దారులు, వృద్ధులు ఏ విధంగా యోగా చేయాలన్నది యోగా మాస్టర్ ట్రైనర్లు ఆసనాలు వేసి చూపించారు. ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జడ్పి చైర్ పర్సన్, జాయింట్ కలెక్టర్ కూడా ఆసనాలు వేసి దివ్యాంగులను ఉత్తేజపరిచారు.

- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ యోగాను రోజు పాటిస్తూ ఆరోగ్యాన్ని బాగుగా పెట్టుకుందామన్నారు. ప్రతి ఒక్కరికి యోగా ఉపయోగంగా ఉంటుందన్నారు. అనంతలో దివ్యాంగుల రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమం చక్కటి అవగాహనతో ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రస్థాయిలో కార్యక్రమాన్ని అనంతపురంలో ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. దివ్యాంగులు, వికలాంగులు, పింఛన్ దారులు మొత్తం 2300 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. శిక్షణ ఇచ్చిన టీచర్లు, వెల్ఫేర్ అధికారులు అందరూ పెద్ద ఎత్తున ఇక్కడ పాల్గొని విజయవంతం చేశారన్నారు. దివ్యాంగులు ఎవరెవరు ఎలాంటి ఆసనాలు చేయగలుగుతారో వాటిపై సూచనలు ఇస్తూ అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈనెల 21న వరల్డ్ రికార్డ్ లో భాగంగా యోగా కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ముందస్తుగానే సన్నాహాలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి పాల్గొన్న ప్రతి ఒక్కరికి కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు.
- ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం మన వైపు చూసేలా ఈరోజు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందన్నారు.
- ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ యోగా అనేది సంస్కృతిలో భాగంగా మనందరికీ లభించిన వరమన్నారు. ఖచ్చితంగా ప్రతి ఒక్కరు వారి జీవితంలో యోగాసనాలు వేసే అలవాటుని ఏర్పాటు చేసుకోవాలని, యోగా వల్ల మన శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత, ఉత్తేజం, ఉల్లాసం లభిస్తాయన్నారు. యోగా గురించి భవిష్యత్ తరాలకు తెలియజేయాలని, మనం కూడా నిత్యం ఆచరించాలన్నారు.



- ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న దివ్యాంగులను, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను, యోగా మాస్టర్ ట్రైనర్లను ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జడ్పీ చైర్ పర్సన్, తదితరులు శాలువా కప్పి మెమొంటోలను అందజేసి సన్మానించారు.
- ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, డిఆర్ఓ ఏ.మాలోల, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి వినోద్, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, ఆర్డీఓ కేశవనాయుడు, డిఆర్డిఏ పిడి మరియు సమగ్ర శిక్ష ఏపీసి శైలజ, మెప్మా పిడి విశ్వజ్యోతి, జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ గురుస్వామిశెట్టి, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, డిఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి, ఆయుష్ డాక్టర్స్ డా.రామ్ కుమార్, డా.లాల్యనాయక్, యోగా గురువులు కృష్ణవేణి, ఆంజనేయులు, ఇంతియాజ్, రాజశేఖర్ రెడ్డి, చలపతి, దివాకర్, చెన్నకేశవులు, రవికుమార్, గురురాజారావు, తహసీల్దార్ హరికుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆయా శాఖల సిబ్బంది, దివ్యాంగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చి
# అప్పుడు సంబరాలు చేసుకోవాలి- ఎమ్మెల్సీ తోట

పార్టీ హిట్ కావొచ్చు కానీ ప్రభుత్వం మాత్రం ఫట్
ఏం సాధించారని విజయోత్సవాలు ?

**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 14:** మండపేట నియోజకవర్గం మండపేట పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర శాసన మండలి సభ్యులు తోట త్రిమూర్తులు మాట్లాడుతూ కలిసి కట్టు గా పోటీ చేసి విజయం సాధించడం లో కూటమి ప్రభుత్వం నెగ్గి ఉండొచ్చు కానీ సుపరిపాలన అందించడంలో మాత్రం ఘోరంగా విఫలమైందని అన్నారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలోని చైర్ పర్సన్ ఛాంబర్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జూన్ 12 న ఏం సాధించారని కూటమి నాయకులు విజయోత్సవాలు చేసుకున్నారో అర్థం కాకుండా ఉందన్నారు. ఊరి బయట ఉండే మద్యం షాప్ లను ఊరిలోకి తీసుకొచ్చినందుకు చేసుకున్నారా లేక తల్లికివందనం పథకం ఏడాది ఎగ్గొట్టి నందుకు చేసుకుంటున్నారా అని ప్రశ్నించారు. ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య కు కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నిధులకు లెక్క చూసుకుంటే దాదాపు 20 లక్షల మందికి తల్లికి వందనం ఇవ్వకుండా ఎగ్గొడుతున్నారని స్పష్టంగా అర్థమవుతుందన్నారు. సూపర్ సిక్స్ పేరు చెప్పి ఒక్క గ్యాస్ సిలెండర్ కు మాత్రమే డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు తప్పితే ఇంకేమి చేయలేదన్నారు. 50 సంవత్సరాలు నిండిన ఎస్సీ ఎస్టీ మహిళలకు పింఛను ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడా ఊసే ఎత్తడం లేదన్నారు. నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి ఏమైందని ప్రశ్నించారు. రైతులకు ఇస్తామన్న 20 వేలు ఎక్కడున్నాయో చెప్పాలన్నారు. వాలంటీర్లకు 5 వేలు కాదు 10 వేలు ఇస్తామని చెప్పిన కూటమి నాయకులు ఆ తరువాత వారిని విధులు నుండి తొలగించడం దారుణమన్నారు. ఏదైనా అంటే వారిని రెన్యువల్ చేయలేదని అంటున్నారని, అధికారం చేతిలో ఉన్న అపుడు మీరే ఎందుకు రెన్యువల్ చేయకూడదని ప్రశ్నించారు. రేషన్ వ్యాన్ లను రద్దు చేసి ప్రజలను ఇబ్బందుల్లోకి నెట్టారన్నారు. జగన్ ప్రజాభిమానం కోల్పోయి ఓటమి చెందలేదని కేవలం కూటమి ఇచ్చిన బూటకపు హామీలు కారణంగా ఓటమి చెందారని పేర్కొన్నారు. పథకాలు చూసి ఏదో చేస్తారనే ఆశతో పేద ప్రజలు కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి గెలిపించారన్నారు. ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేర్చిన తరువాత సంబరాలు చేసుకుంటే బాగుంటుంది గాని ఏమి చేయకుండా సంబరాలు చేసుకోవడం ఏమిటని తోట విమర్శించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పతివాడ రాణి, వైస్ చైర్మన్ వేగుళ్ళ నారయ్యబాబు,మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# యోగా వలన ఆరోగ్య పరిరక్షణ సాధ్యం...

-జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్

**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి ,జూన్ 14:** శ్రీ సత్య సాయి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజలు నిత్యంయోగా సాధనలను వలన ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికిసాధ్యమవుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ తెలిపారు. శనివారం ఉదయం పుట్టపర్తి లోని సత్యమ్మ దేవాలయం వద్దనున్న సాంఘిక సంక్షేమ శాఖ ప్రభుత్వ బాలికల వసతి గృహం ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం కోసం యోగా ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ప్రస్తుత తరుణంలో ఆధ్యాత్మిక , శారీరక మరియు మానసిక ఒత్తిడితో కూడిన జీవితంలో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం ఎంతో ముఖ్యమైన విషయం అని జాయింట్ కలెక్టర్ తెలిపారు. ప్రతి మనిషి ఆరోగ్యానికి యోగా ప్రధాన పాత్ర వహిస్తుందని పేర్కొన్నారు. అలాగే యోగా అనేది కేవలం శరీర విన్యాసాలసమూహారమే కాదని అది ప్రతి మనిషి జీవనశైలికి మెరుగుపరిచే విధానమని అన్నారు. యోగా ను మన జీవితంలో భాగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు తద్వారా ఆరోగ్యమైన జీవితాన్ని తీర్చి దిద్దుకొనుటకు అవకాశం ఉంటుందన్నారు. 2025 - యోగాంధ్ర ప్రాముఖ్యతపై గత మే నెల 21 నుండి ఈనెల జూన్ వరకు రాష్ట్రవ్యాప్తంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లాలో కూడా అనేక ఆధ్యాత్మిక , పర్యాటక ప్రాంతాలలో కూడా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా కూడా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వివిధ మండల లలో గ్రామాలలో యోగా ఆవశ్యకతపై ప్రజలను చైతన్యం చేసే దిశగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, మహిళలు స్వచ్ఛంద సేవా సంస్థలు ,ఉద్యోగులు, ఉపాధ్యాయులు సమాజంలోని అన్ని వర్గాల ను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తూ అవసరమైన మేరకు కార్యక్రమాలు రూపొందించుకొని వాటిని అమలు చేస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ తెలిపారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. ఈనెల 21న విశాఖపట్నంలో జరగనున్న అంతర్జాతీయ యోగ



దినోత్సవం విజయవంతం చేయాలని ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా కూడా ఆ రోజున జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జాయింట్ కలెక్టర్ కోరారు.
ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య , జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివ రంగ ప్రసాద్, పుర ప్రజలు, యోగా ఔత్సాహికులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని జాయింట్ కలెక్టర్ తో కలిసి యోగాసనాలు చేశారు. నిష్ణాతులైన యోగా శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

## సత్యనారాయణ స్వామి సన్నిధిలో వ్రతం ఆచరించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ జూన్ 14:** అన్నవరంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి సన్నిధిలో వ్రతం ఆచరించి, స్వామి వార్లను దర్శి%శీ%చుకున్న వారిలో అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, యువ నాయకులు నల్లమిల్లి మనోజ్ రెడ్డి సుమేఘ దంపతులు, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి మూలారెడ్డి సతీమణి నల్లమిల్లి సత్యవతి ఉన్నారు.

## పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన తిరుపతి ,పాలకొండ జనసేన ఎమ్మెల్యేలు

- సత్కరించిన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి





**అంకుశం న్యూస్ పుట్టపర్తి జూన్ 14:** దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగం చేసిన మురళీ నాయక్ కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి రూ.25 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందిస్తామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చిన మాట మేరకు శనివారం పుట్టపర్తి లోని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి క్యాంపు కార్యాలయానికి విచ్చేశారు. వారికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు.జన సేన ఎమ్మెల్యేలను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ని శాలువాతో సత్కరించి భగవాన్ శ్రీ సత్యసాయి బాబా చిత్ర పటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గ జన సేన నాయకులు పత్తి చంద్రశేఖర్, అబ్దుల్ , టీడీపీ నాయకులు రామాంజనేయులు, రామారావు ,లక్ష్మీపతి , గంగాధర్ నాయుడు ,సామకోటి ఆదినారాయణ , అంబులెన్స్ రమేష్ ,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రథోత్సవంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరుడి అభయం





**అంకుశం న్యూస్ తిరుపతి జూన్ 14:** అప్పలాయగుంట శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 09.00 గం.లకు లకు శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వారు రథోత్సవంపై శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి విహరించి భక్తులను అనుగ్రహించారు. ఉదయం 7 - 8.30 గం.ల మధ్య పుణ్యాహవచనం, నవగ్రహపూజ చేపట్టారు. తదుపరి 8.41 - 8.55 గం.ల మధ్య రథారోహణం, 8.55- 8.58 గం.ల మధ్య రథాగమనం నిర్వహించారు. 09.00 - 10.30 గం.లకు భక్తజనసమోహం మధ్య రథోత్సవం చేపట్టారు. సా. 5.30 - 6.30 గం.ల మధ్య ఊంజల్ సేవ నిర్వహించనున్నారు. రాత్రి 07.00 - 08.00 గం.ల మధ్య అశ్వవాహనంపై స్వామి వారు భక్తులను ఆశీర్వదించనున్నారు.
**జూన్ 15న చక్రస్నానం, ధ్వజావరోహణం :** జూన్ 15 ఆదివారం ఉదయం 08.00- 9.00 గం.ల మధ్య పల్లకీ ఉత్సవం జరుగనుంది. తదుపరి 9.15 - 10.30 గం.ల వరకు స్నపన తిరుమంజనం చేపడుతారు. అనంతరం ఉదయం 10.30 - 10.45 గం.ల వరకు తీర్థవారి చక్రస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం 4.00- 5.00 గం.ల మధ్య శ్రీవారి మాడవీధి ఉత్సవం జరుగుతుంది. రాత్రి 07.00 - 07.30 గం.ల మధ్య ధ్వజావరోహణతో శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.
వాహన సేవలో టిటిడి డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీమతి శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, అర్చకులు, శ్రీవారి సేవకులు,భక్తులు పాల్గొన్నారు.